RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in rajadhanivoicedaily@gmail.com

విలేఖరులు కావలెను
రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కొనసాగుటకు
గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు
నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు
మండలాల వారిగా విలేఖరులు కావవలెను
ఆసక్తి గలవారు సంప్రదించగలరు.
9030343195
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

సంపుటి : 02 | సంచిక : 337 | 28 బుధవారం అక్టోబరు 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

# వణికిస్తున్న అర్నబ్





**విశాఖపట్నం, అమరావతి, రాజధాని వాయిస్ అక్టోబర్ 27 :** : అతి తీవ్ర తుపాను 'అర్నబ్' కోస్తాంధ్రను వణికించింది. మంగళవారం వీచిన ప్రచండ గాలులకు భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పలుచోట్ల హోర్డింగులపై ఫ్లెక్సీలు ఎగిరిపోయాయి. అత్యంత భారీవర్షాలకు లోతట్టుప్రాంతాలు జలమయమయ్యాయి. తుపాను తీవ్రతకు బంగాళాఖాతం అల్లకల్లోలంగా మారింది. తీరప్రాంతాల్లో అలలు భారీగా ఎగిసిప డ్డాయి. పలుచోట్ల సముద్రం ముందుకొచ్చింది. మంగళవారం తెల్లవారుజా ము నుంచే ఈదురుగాలులతో కూడిన వర్షం ప్రారంభమైంది. మధ్యాహ్నానికి గాలివాన ఉద్ధృతం కావటంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో అతి భారీవర్షం కురిసింది. రాత్రి 10 గంటల వరకు అత్యధికంగా విశాఖలో 192.89 మి.మీ., విజయనగరం జిల్లా కొత్తవలసలో 162.75 మి.మీ వర్షపాతం నమోదైంది. తుపాను తీవ్రతకు 63 రైళ్లు రద్దవగా 15 రైళ్లను రీషెడ్యూల్ చేశారు. విశాఖ జిల్లాలో 160 ఆర్టీసీ సర్వీసులను రద్దు చేశారు. తుపాను తీవ్రత మరింత పెరగటంతో మంగళవారం రాత్రి నుంచి విశాఖతోపాటు పలు జిల్లాల్లో రాత్రి ప్రయాణాలపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది.

**150 కి.మీ. వేగంతో ఈదురుగాలులు** పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అతి తీవ్ర తుపాను గంటలకు 20 కిలోమీటర్ల వేగంతో వాయవ్య దిశగా కదిలింది. మంగళవారం సాయంత్రానికి విశాఖకు దక్షిణ ఆగ్నేయంగా 170 కి.మీ., కాకినాడకు తూర్పు ఆగ్నేయంగా 180, మచిలీపట్నానికి 270, బాపట్లకు 350 కి.మీ. దూరంలో ఉంది. వాయవ్య దిశగా కదులుతూ రాత్రి 8.30 గంటలకు భూభాగాన్ని (బాహ్యావలయం) తాకింది. అర్ధరాత్రి దాటిన తరువాత 2 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల మధ్య యానాం సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని భారత వాతావరణశాఖ అంచనా వేసింది. ఈ సమయంలో 125-135 కి.మీ. వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. గరిష్ఠంగా 150 కి.మీ. వేగంతో వీచే అవకాశముందని చెప్పింది. విశాఖ-బాపట్ల మధ్య తుపాను అత్యంత తీవ్ర ప్రభావం చూపవచ్చని తెలిపింది.

**ఈ జిల్లాలపై ప్రభావం..** కోస్తాంధ్రలోని అన్ని ప్రాంతాల్లో బుధవారం 7- 20 సెం.మీ. వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురవొచ్చు. అతి తీవ్ర తుపాను తీరం దాటే సమయంలో కాకినాడ-యానాం మధ్య అలలు 1.5-2.5 మీటర్ల ఎత్తులో ఎగిసిపడవచ్చని వాతావరణశాఖ తెలిపింది. కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో సముద్రం ముందుకు చొచ్చుకొచ్చే అవకాశముందని పేర్కొంది.

## సామాన్యులకు చంద్రబాబు సర్కారు భారీ ఊరట.. తక్కువ ధరకే నిత్యావసరాలు



**అమరావతి, రాజధాని వాయిస్** : రాష్ట్రంలో పెరుగుతున్న నిత్యావసరాల ధరల నుంచి సామాన్య ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ధరల నియంత్రణపై ఉన్నతాధికారుల తో సమీక్ష నిర్వహించిన సీఎం, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కందిపప్పు, పామాయిల్, గోధుమ పిండి వంటి సరుకులను అందుబాటు ధరలకు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వంపై నెలకు రూ.100 కోట్ల అదనపు భారం పడినా, ప్రజలకు మేలు చేకూర్చడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

**దీపావళి నాటికి రేషన్ షాపుల్లో రాయితీ సరుకులు**

నిత్యావసరాల ధరల నియంత్రణపై పౌరసరఫరాల శాఖ అధికారులతో సీఎం చంద్రబాబు మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.170 నుంచి రూ.200 పలుకుతున్న కందిపప్పును రేషన్ కార్డుదారులకు కేవలం రూ.100కే అందించాలని నిర్ణయించారు. అదేవిధంగా, లీటర్ పామాయిల్‌ను రూ.125కు, కిలో గోధుమ పిండిని రూ.25కే సరఫరా చేయాలని ఆదేశించారు. దీపావళి పండుగ నాటికి ఈ సరుకుల పంపిణీని ప్రారంభించేలా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ నిర్ణయం వల్ల లక్షలాది పేద, మధ్యతరగతి కుటుంబాలకు ధరల భారం నుంచి పెద్ద ఊరట లభించనుంది.

**'ధరణి' బియ్యం ఇక మండల కేంద్రాల్లోనూ..**

ప్రభుత్వం 'ధరణి' బ్రాండ్ పేరుతో రైతు బజార్లలో విక్రయిస్తున్న నాణ్యమైన బియ్యాన్ని ఇకపై రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, మండల కేంద్రాలకు విస్తరించాలని సీఎం ఆదేశించారు. మొబైల్ వాహనాల ద్వారా ప్రజల వద్దకే వెళ్లి ఫైన్ రకం బియ్యాన్ని కిలో రూ.49, సూపర్ ఫైన్ రకాన్ని రూ.50 చొప్పున విక్రయించాలని స్పష్టం చేశారు. బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలను అదుపు చేసేందుకు రైస్ మిల్లర్లు, హోల్‌సేల్ అసోసియేషన్లతో ప్రభుత్వం జరిపిన చర్చలు ఫలించాయి. బీపీటీ స్టీమ్ బియ్యాన్ని కిలో రూ.66కు, సాధారణ స్టీమ్ బియ్యాన్ని రూ.47కు మించకుండా విక్రయించేందుకు మిల్లర్లు అంగీకరించినట్లు అధికారులు సీఎంకు వివరించారు. పొరుగు రాష్ట్రాలకు ధాన్యం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘా పటిష్టం చేయాలని చంద్రబాబు ఆదేశించారు.

## ప్రజల ప్రాణరక్షణకే తొలి ప్రాధాన్యం



**అమరావతి, రాజధాని వాయిస్ :** అర్నబ్ తుపాను నేపథ్యంలో ప్రజల ప్రాణరక్షణకే తొలి ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. శ్రీకాకుళం మొదలు కృష్ణా జిల్లా వరకు 290 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి, 84,396 మందిని తరలించామని వెల్లడించారు. రాష్ట్ర, జిల్లా స్థాయుల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లు 24 గంటలూ పనిచేస్తాయని పేర్కొన్నారు. ఆర్టీజీఎస్ ద్వారా తుపాను కదలికల్ని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రతి గంటకూ ఒక బులెటిన్ జారీ చేస్తామన్నారు. ఉండవల్లి నివాసం నుంచి అధికారులు, తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో మంగళవారం ఆయన సమీక్షించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తుపాను సన్నద్ధతను వివరించారు. 'తుపానుపై జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో నిరంతరం సమీక్షిస్తూ వారిని అప్రమత్తం చేస్తున్నా. అర్నబ్ తుపాను తీవ్రత గతంలో వచ్చిన హుద్‌హుద్ కంటే తక్కువగా తిత్లితో సమానంగా ఉంది. కృష్ణా నుంచి శ్రీకాకుళం వరకు భారీ వర్షాలు, గాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. యానాం వద్ద తుపాను తీరాన్ని దాటే అవకాశం ఉంది. లోతట్టు ప్రాంతాలు, తీర, లంక ప్రాంత ప్రజలు పునరావాస కేంద్రాలకు చేరుకోవాలి. తుపాను ప్రభావిత జిల్లాల్లోని ప్రజలు ప్రయాణాలు రద్దు చేసుకుని ఇళ్లలోనే ఉండాలి. తుపాను నేపథ్యంలో ఆయా జిల్లాల్లోని 5,180 మంది గర్భిణుల్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించాం. మత్స్యకారులకు చెందిన 30 వేల పైచిలుకు బోట్లను సముద్రం నుంచి వెనక్కు రప్పించాం. విద్యుత్ అంతరాయం వస్తే వెంటనే స్పందించేందుకు 8,400 మందిని సిద్ధం చేశాం. నదులు, వాగులు, వంకల్లో నీటి ప్రవాహాల్ని అంచనా వేయడంతో పాటు చెరువులకు గండ్లు పడినా వెంటనే పునరుద్ధరిస్తాం.

## జగన్ 2.0 అంటే.. మేం 10 ఎక్స్ చూపిస్తాం



**అమరావతి, రాజధాని వాయిస్** : వైకాపా అధ్యక్షుడు జగన్ 2.0 చూపిస్తే.. దానికి 10 రెట్లు అధికంగా (10 ఎక్స్) ఎన్డీయే నుంచి ప్రతిఘటన ఉంటుందని ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ హెచ్చరించారు. వారి బెదిరింపులకు భయపడిపోయే వారెవరూ లేరని అన్నారు. వైకాపా హింసకు తెగబడితే దాన్ని ఎలా ఎదుర్కోవాలో, ప్రజలకు రక్షణ కవచంగా ఎలా నిలబడాలో తమకు బాగా తెలుసని పేర్కొన్నారు. బలహీనులే బెదిరింపులకు పాల్పడతారని, బలవంతులు మౌనంగానే ఉంటారని వివరించారు. గతంలో జగన్ 1.0ను ఎలా ఎదుర్కొన్నామో చూశారు కదా! అని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి, తెదేపా అధ్యక్షుడు చంద్రబాబు, భాజపా ఏపీ అధ్యక్షుడు మాధవ్‌తో కలిసి ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పవన్‌కల్యాణ్ మాట్లాడారు. బెదిరింపులు, హింస ద్వారా సాధించేదేమి ఉండదని, ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పినట్లుగా జగన్, వైకాపా వాటిని విడనాడి ప్రధాన స్రవంతి రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు చాలా చొరవ తీసుకున్నారు

'సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు చాలా తేలిగ్గా చేసుకోగలిగాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రం చాలా అంశాలు పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆకాంక్షలు చాలా మందిలో పెరిగిపోయాయి. కార్యకర్తలు చెబుతున్నారు కదా అని నేనూ నేల విడిచి సాము చేయలేదు. దశాబ్దాల అనుభవముందని చంద్రబాబు ఎక్కడా తూలనాడలేదు. మద్దతిస్తున్నాం కదా అని భాజపా ఒత్తిడి తీసుకురాలేదు. కూటమి స్ఫూర్తిని నిలబెట్టడానికే అందరం ప్రయత్నించాం. సీట్ల సర్దుబాటు విషయంలో చంద్రబాబు చాలా చొరవ తీసుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపికల బాధ్యతను గతంలో తెదేపా స్థానిక నాయకత్వాలకు అప్పగించేసేది. ఇప్పుడు కూటమిగా వెళ్తుండటం వల్ల చంద్రబాబు క్షేత్రస్థాయి వరకూ ప్రతిదీ పరిశీలించారు' అని పవన్ పేర్కొన్నారు. 'మూడు పార్టీల నుంచి పెద్ద ఎత్తున ఔత్సాహికులు నామినేషన్లు వేశారు. ముగ్గురు నాయకులం కలిసి సీట్ల సర్దుబాటుపై ఏకాభిప్రాయానికి వచ్చాం. ఆ దిశగానే క్షేత్రస్థాయిలో అందరూ పనిచేయాలి. మూడు పార్టీల నాయకత్వం ఖరారు చేసిన జాబితాలోని వారికి మాత్రమే బీ-ఫారాలు అందిస్తాం. వారు మాత్రమే బరిలో నిలవండి. మిగిలిన వారికి భవిష్యత్తులో అవకాశాలు కల్పిస్తాం. కూటమికి తోడుగా నిలబడి మీ ఆశీస్సులు అందించండి. రెబల్‌గా ఎవరైనా ఉంటే ఆయా పార్టీలు వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాయి. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, పెట్టుబడులను మేము ముందుకు తీసుకెళ్తాం. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి సాధించిన విజయాన్నే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సాధించేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలి' అని పవన్ సూచించారు.

## పోలింగ్ రోజున పులివెందులలో ఉంటా.. భయపడొద్దు.. తిరగబడండి: జగన్



**కడప, రాజధాని వాయిస్** : "ఈ రెండేళ్లు ఓపిక పట్టండి.. వచ్చేది జగన్ 2.0" అని పార్టీ శ్రేణులకు వైసీపీ అధినేత జగన్ పిలుపునిచ్చారు. పులివెందులలోని తన క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన ఆయన... అధికార కూటమిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పులివెందుల నుంచి మొదలయ్యే ధ్వని రాష్ట్రమంతా వినిపించాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని తుడిచిపెట్టేస్తామని ధీమా వ్యక్తం చేశారు. "మా టైమ్ వచ్చినప్పుడు, చట్టాన్ని అతిక్రమించి అన్యాయం చేసిన ఏ అధికారినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. వారు సర్వీసులో ఉన్నా, ఒకవేళ రిటైర్ అయిపోయినా సరే.. ఎక్కడున్నా తీసుకొచ్చి చట్టం ముందు నిలబెట్టి చర్యలు తీసుకుంటాం. వడ్డీతో సహా చెల్లించేలా చేస్తాం" అని తీవ్రంగా హెచ్చరించారు. పులివెందులలో తమ కార్యకర్తలపై చేయి వేస్తే, తనపై చేయి వేసినట్లేనని ఆయన స్పష్టం చేశారు. "మన హక్కులు మనమే కాపాడుకోవాలి. తిరగబడండి" అని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో అధికార కూటమి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. "ఎన్నికల్లో 50 శాతం సీట్లలో పోటీ చేస్తున్నది మా అక్కచెల్లెమ్మలే. వారి నామినేషన్లను నడిరోడ్డుపై అడ్డుకుంటున్నారు. అక్కచెల్లెమ్మల చీరలు చించి దాడులు చేశారు. ఇలా చేయడానికి మీకు సిగ్గుందా? వైసీపీ హయాంలోనే మహిళల కు నిజమైన న్యాయం జరిగింది. ఇప్పుడు చంద్రబాబు చేస్తున్న పనులకు ఆయనే సిగ్గుతో తలదించుకోవాలి" అని మండిపడ్డారు. నామినేషన్ల ప్రక్రియలో అడుగడుగునా అక్రమాలు జరిగాయని జగన్ ఆరోపించారు. "కూటమి నేతలే 17 మున్సిపాలిటీలు ఏకగ్రీవమని ప్రకటించుకున్నారు. నా సొంత నియోజకవర్గమైన పులివెందులలోనే కేవలం 20 వార్డుల్లో నామినేషన్లు వేయగలిగాం. 7 జడ్పీటీసీ స్థానాలకు గాను 4 చోట్ల మాత్రమే పోటీ జరుగుతోంది. స్క్రూటినీ పేరిట 2 మండలాల్లో మా నామినేషన్లను అన్యాయంగా తిరస్కరించారు" అని దుయ్యబట్టారు. కార్యకర్తలంతా ధైర్యంగా ఉండాలని, వారికి తాను అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ రోజున తాను స్వయంగా పులివెందులలోనే ఉంటానని ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలుపు ఖాయమని అన్నారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని... మీ అన్న మీకు తోడుగా ఉంటాడని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.

## ఈ రెండున్నరేళ్లలో ప్రజలపై వేసిన బండ చాలదా?: పేర్ని నాని

**మచిలీపట్నం, రాజధాని వాయిస్** : స్థానిక ఎన్నికల వేళ టీడీపీ ప్రదర్శిస్తున్న తీరు పట్ల మాజీ మంత్రి పేర్ని నాని మండిపడ్డారు. మంగళవారం పేర్ని నాని మచిలీపట్నంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. "మీకు మళ్లీ ఓటు వేసి ప్రజలు ఇబ్బందులు పడాలా? జెడ్పీటీసీ, మున్సిపాలిటీల్లో ఎందుకు ప్రత్యక్ష ఎన్నికలు పెట్టలేదు. నీతి నిజాయితీకి పెద్ద పీట వేశామని చంద్రబాబు గొప్పలు చెబుతున్నారు. మీ ఎమ్మెల్యేలు ఎవరైనా నీతి నిజాయితీగా ఉన్నారా?. అవినీతి చేస్తున్న ఎమ్మెల్యేలను కంట్రోల్ చేయడం లేదు. ఎమ్మెల్యేలను అవినీతికి దూరంగా ఉంచలేకపోతున్నారు. అసలు చంద్రబాబుకి నీతి, నిజాయితీ ఉన్నాయా? అర్నబ్ తుపాన్‌తో పవన్ కల్యాణ్ అభ్యర్థులను సెలక్ట్ చేయలేకపోయారట. జనసేన కార్యకర్తలు త్యాగాలు చేయాలని పవన్ చెబుతున్నారు. ఈ రెండున్నరేళ్లలో ప్రజలపై వేసిన బండ చాలదా?" అని పేర్ని నాని అన్నారు.

**ఎందుకు మీకు ఓట్లు వేయాలి?**

ఓట్లు వేయండని చంద్రబాబు, పవన్, మాధవ్ అడుగుతున్నారని పేర్ని నాని చెప్పారు. ఏపీ ప్రజలు ఎందుకు వాళ్లకు ఓట్లు వేయాలని పేర్ని నాని నిలదీశారు. "కనీసం మీ అంతరాత్మను ప్రశ్నించుకోరా? మీకు ఎందుకు ప్రజలు ఓట్లు వేయాలని ప్రశ్నిస్తున్నా. ప్రజలను లూటీ చేసినందుకు ఓట్లు వేయాలా? బియ్యం కట్ట 2600 రూపాయలకు చేరినందుకు మీకు ఓట్లు వేయాలా? నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నందుకు ఓట్లు వేయాలా? కేజీ ఉల్లిపాయలు 60 రూపాయలకు తెచ్చినందుకు ఓట్లు వేయాలా? మీరు ముగ్గురూ జనం సొమ్ముతో స్పెషల్ ఫ్లైట్లలో తిరుగుతున్నందుకు ఓట్లు వేయాలా? హెలీకాప్టర్లలో హైదరాబాద్ కు వారంవారం ట్రిప్పులు వేస్తున్నందుకు ఓట్లు వేయాలా? పాదయాత్రలో సెల్ఫీలు దిగుతూ లోకేష్ తో చాలా మాట్లాడించారు.

అప్పుడు పెట్రోల్ బంక్ ల ముందు సెల్ఫీలు దిగారు. ఇప్పుడు పెట్రోల్,డీజిల్ ఎంత ఉన్నాయో తెలియదా? రేట్లు తగ్గాలంటే చంద్రబాబుకు ఓటు వేయాలన్నారు. ఎందుకు రేట్లు తగ్గడం లేదు. కరెంట్ ఛార్జీలు పెంచలేదని చెబుతున్నారు. చంద్రబాబు మాటలన్నీ ట్రూ డౌన్ మాటలే. చంద్రబాబు ఒక ఫేక్ సీఎం. చంద్రబాబు చెప్పేవన్నీ పచ్చి అబద్ధాలే. ఈ రాష్ట్రానికి మీరు ఏం పొడిచేశారో సమాధానం చెప్పాలి. మీది ఆలీ బాబా ఇద్దరు దొంగల కూటమి. ఈ రెండున్నరేళ్లలో ప్రజల నెత్తిన వేసిన బండ సరిపోవట్లేదా?

ట్రిపుల్ ఇంజన్ సర్కారు రావాలంటున్నారు. ఈ రెండున్నరేళ్లలో ప్రజలను దంచి దంచి వదిలిపెట్టారు. మున్సిపాల్టీల్లోనే మంచి నాయకత్వం కావాలా? జిల్లా పరిషత్ ఎన్నికల్లో మంచి నాయకత్వం వద్దా? మండలాల్లో ప్రత్యక్ష ఎన్నికలు అవసరం లేదా?" అని చెప్పారు.

# స్థానిక సమరానికి కూటమి సిద్ధం



**అమరావతి, రాజధాని వాయిస్ :** "చెప్పాం.. చేస్తున్నాం" అనే నినాదంతో రాష్ట్రంలో సానుకూల వాతావరణంలో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తున్నామని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తెలిపా రు. పాలక కూటమి ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుకుంటూ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి కీలకమైనవని, ప్రజల అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా పాలన అందించడమే తమ లక్ష్యమని వివరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా కూటమి ప్రభు త్వం పనిచేస్తోందని, ఈ ఎన్నికల్లోనూ ప్రజల మద్దతు తమకు లభిస్తుందనే నమ్మకం ఉందని ఆయన వెల్లడించారు.పాలక కూట మిలోని తెలుగుదేశం, జనసేన, భాజపా మూడు పార్టీలు సుదీర్ఘ చర్చలు, కసరత్తు అనంతరం ఏకాభిప్రాయానికి వచ్చాయని మాధవ్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో కుదిరిన అవగాహనను క్షేత్రస్థాయికి తీసుకెళ్లి, స్థానిక నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం సాధిం చేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. సీట్ల సర్దుబాటు విషయంలో పరస్పర అంగీకారంతో ముందుకు సాగుతూ ఎన్నికల బరిలో నిలిచామని స్పష్టం చేశారు. కూటమిలో విభేదాలు తలెత్తుతా యని, భాగస్వామ్య పక్షాల మధ్య ఐక్యత దెబ్బతింటుందని ప్రత్యర్థు లు ఆశించినప్పటికీ, అలాంటి పరిస్థితులకు తావివ్వలేదని పేర్కొన్నా రు. మూడు పార్టీల నాయకులు పరస్పర సహకారంతో పనిచేయ డం వల్ల ఎన్నికలను సమష్టిగా ఎదుర్కొనేందుకు మార్గం సుగమ మైందని వివరించారు.మూడు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు ప్రక్రియలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక పాత్ర పోషించారని మాధవ్ ప్రశంసించారు. భాగస్వామ్య పక్షాల అభిప్రా యాలను పరిగణనలోకి తీసుకుంటూ అందరికీ ఆమోదయో గ్యమైన నిర్ణయాలు తీసుకోవడంలో ఆయన చేసిన కృషి అభినందనీ యమని అన్నారు. తెలుగుదేశం, జనసేన, భాజపా మధ్య ఉన్న సమన్వ యం ఎన్నికల విజయానికి దోహదపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రదర్శించిన ఐక్యతను స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కొనసాగిస్తామని చెప్పారు. గ్రామ స్థాయి నుంచి పట్టణాల వరకు కూటమి నాయకులు, కార్యకర్తలు ఒకే లక్ష్యంతో పనిచేయాలని, ప్రజలకు చేరువగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు అన్ని ప్రాంతాలకు సమానంగా చేరాలనే ఉద్దేశంతోనే స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొంటున్నా మని మాధవ్ వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి వసతి, రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, ప్రజలకు అవసరమైన ఇతర సదుపాయాల మెరుగు దల స్థానిక సంస్థల ద్వారా సాధ్యమవుతాయని పేర్కొన్నారు. వాతావరణ మార్పులు, సూపర్ ఎల్‌నినో వంటి సవాళ్లు ఎదురైనప్ప టికీ సమన్వయంతో పనిచేస్తూ సుపరిపాలన అందించేం దుకు కూటమి కృషి చేస్తోందని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలంటే స్థానిక సంస్థలు సమర్థంగా పనిచేయాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం ప్రజాప్రతినిధులు బాధ్యతాయుత ంగా వ్యవహరించాలని ఆయన అభిప్రాయపడ్డారు.స్థానిక సంస్థల ఎన్నికలను కూటమి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోందని మాధవ్ స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించేందుకు మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచే యాలని, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు అందించిన మద్దతును స్థానిక ఎన్నికల్లోనూ కొనసాగిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి జరగాలంటే ప్రజల భాగస్వామ్యం, ఆశీస్సులు అవసరమని పేర్కొంటూ, కూటమి అభ్యర్థులను ఆదరించాలని ప్రజలను కోరారు. ఐక్యత, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యాలుగా ముందుకు సాగుతూ స్థానిక ఎన్నికల్లోనూ సమష్టి విజయాన్ని సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# తుపాను సహాయక చర్యల్లో పోలీసుల అప్రమత్తత



**అనకాపల్లి, రాజధాని వాయిస్ :** తుపాను ముప్పు నేపథ్యంలో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అనకాపల్లి జిల్లా పోలీసు యంత్రాం గం విస్తృత స్థాయిలో సహాయక చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాం తాల్లో పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. సముద్రం అల్లకల్లోలంగా మారడం, బలమైన గాలులు వీచే అవకాశం ఉండటంతో మత్స్యకారులు, తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. తుపాను ప్రభావి త ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన సహాయం అందించేందుకు పోలీసు సిబ్బందిని అందుబా టులో ఉంచారు. ప్రమాదకర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించడంతోపాటు, పునరావాస కేంద్రాల్లో తగిన వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే తక్షణమే స్పందించేందుకు సంబంధిత శాఖలతో సమన్వ యం చేసుకుంటూ ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. రోలుగుంట మండలం శరభవరం పునరావాస కేంద్రాన్ని కొత్తకోట సీఐ జి. కోటేశ్వర రావు, రోలుగుంట ఎస్సై రామకృష్ణారావు సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. శిబిరంలో ఆశ్రయం పొందుతు న్న ప్రజలకు అందిస్తున్న వసతులు, భోజనం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. తుపాను సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా అవసరమైన సౌకర్యా లు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. శిబిరం వద్ద భద్రతను పర్యవేక్షించే ందుకు ప్రత్యేక పోలీసు పికెట్‌ను ఏర్పా టు చేశారు. పునరావాస కేంద్రాల్లో ప్రజల రాకపోకలు, భద్రతా పరిస్థితులను నిరంతరం గమనిం చాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, మహిళలు, అనా రోగ్య సమస్యలున్న వారికి అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.సముద్రం తీవ్ర అల్లకల్లోలంగా మారిన నేపథ్యంలో అచ్యుతాపురం సీఐ చంద్రశేఖర్, మెరైన్ విభాగం సీఐ, ఎస్సై సుధాకర్ సిబ్బందితో కలిసి పూడిమడక తీర ప్రాంతాన్ని పరిశీలించారు. తుపాను ప్రభావం, సముద్ర అలల ఉద్ధృతి కారణంగా ఎదురయ్యే ప్రమాదాలను స్థానికులకు వివరించారు. మత్స్యకారులు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లవద్దని, ఇప్పటికే సముద్రంలో ఉన్నవారు సురక్షితంగా ఒడ్డుకు చేరుకోవాలని సూచించారు. తీర ప్రాంతాల్లోని ప్రజలు సముద్రానికి దగ్గరగా వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించా రు. అలల ఉద్ధృతిని చూసేందుకు ఆసక్తితో తీరానికి చేరుకోవడం ప్రమాదకరమని, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. తుపాను ప్రభావం తగ్గే వరకు తీర ప్రాంతాల్లో పోలీసుల పర్యవేక్షణ కొనసాగుతుందని అధికారులు పేర్కొన్నారు.నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద మోహరించిన జాతీయ విపత్తు స్పందన దళం బృందంతో నక్కపల్లి సీఐ మురళి సమావేశమై పరిస్థితులను వివరించారు. రానున్న 48 గంటల్లో ఎదురయ్యే వాతావరణ పరిస్థితు లను దృష్టిలో ఉంచుకుని అత్యవసర సమయాల్లో చేపట్టా ల్సిన రక్షణ, సహాయక చర్యలపై సమన్వయంతో ప్రణాళిక రూపొ ందించారు. అవసరమైన ప్రాంతాల్లో ప్రజలను తరలించడం, ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించడం, పునరావాస కేంద్రాల కు సహాయం అందించడం వంటి అంశాలపై చర్చించారు. మరో వైపు, వడ్డాది గ్రామ శివార్లలో నివసిస్తున్న సంచార జాతులకు చెందిన సుమారు 36 మందిని ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా వడ్డాది తుపాను సహాయక కేంద్రాని కి తరలించారు. బుచ్చెయ్యపేట ఎస్సై మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో వారికి వసతి, భోజనం, తాగునీరు, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశారు. ప్రమాదకర పరిస్థితులు ఏర్పడకముందే వారిని సురక్షిత ప్రాం తానికి తరలించడం ద్వారా ప్రాణనష్టాన్ని నివారించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

# తుపాను హెచ్చరికలపై అప్రమత్తంగా ఉండాలి

**అమరావతి, రాజధాని వాయిస్ :** అర్నబ్ తుపాను హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి అనిత సూచించారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, వాతావరణ శాఖ జారీ చేసే హెచ్చరికలు, సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. తుపాను ప్రభావం వల్ల భారీ వర్షాలు, బలమైన గాలులు, సముద్ర అలల ఉద్ధృతి పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని పేర్కొన్నారు. ముఖ్యంగా తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు అధికారుల సూచనల మేరకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విపత్తులు సంభవించిన తర్వాత స్పందించడం కంటే, ముందుగానే అప్రమత్తమై ప్రమాదాలను నివారించుకోవడం ఎంతో ముఖ్యమని ఆమె సూచించారు.తుపాను ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నివసించే ప్రజలు తమ కుటుంబ సభ్యుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని హోంమంత్రి కోరారు. అధికారులు అవసరమని సూచించినప్పుడు ఆలస్యం చేయకుండా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని తెలిపారు. సముద్ర తీరాలకు, వరదలు వచ్చే అవకాశం ఉన్న ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని, సముద్రంలో అలల ఉద్ధృతిని పరిశీలించేందుకు తీరానికి చేరుకోవడం కూడా ప్రమాదకరమని హెచ్చరించారు. తుపాను సమయంలో చెట్లు, విద్యుత్తు స్తంభాలు, దెబ్బతిన్న భవనాల సమీపంలో ఉండకూడదని, పిల్లలు, వృద్ధుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు.ప్రజల భద్రత కోసం ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని హోంమంత్రి సూచించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు, పునరావాస ఏర్పాట్లు, అత్యవసర సేవలు అందుబాటులో ఉండటం కీలకమని పేర్కొన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలను నిర్లక్ష్యం చేయకుండా, అధికారుల నుంచి వచ్చే సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని కోరారు. సామాజిక మాధ్యమాల్లో ధ్రువీకరణ లేని వార్తలు, తప్పుడు సమాచారాన్ని ఇతరులకు పంపకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే సంబంధిత అధికారులకు సమాచారం అందించి సహాయం పొందాలని తెలిపారు.తుపాను సమయంలో విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రజలు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని హోంమంత్రి సూచించారు. తాగునీరు, అత్యవసర మందులు, అవసరమైన ఆహార పదార్థాలను అందుబాటులో ఉంచుకోవాలని, అధికారుల సూచన లేకుండా వరదనీరు ప్రవహించే రహదారులను దాటేందుకు ప్రయత్నించకూడదని తెలిపారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిలిచే పరిస్థితులు ఉంటే అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సేవలకు ఆటంకం కలిగించే విధంగా రహదారులపై సంచరించకూడదని పేర్కొన్నారు. తుపాను ప్రభావం తగ్గే వరకు ప్రజలు అప్రమత్తతను కొనసాగించడం



ద్వారా ప్రమాదాలను తగ్గించుకోవచ్చని వివరించారు.ప్రజల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు తమ కుటుంబ సభ్యులు, పరిసరాల్లోని ప్రజలను కూడా అప్రమత్తం చేయాలని కోరారు. అధికారుల సూచనలను పాటించడం, అవసరమైనప్పుడు సురక్షిత ప్రాంతాలకు వెళ్లడం, అత్యవసర సేవలకు సహకరించడం ద్వారా తుపాను ముప్పును సమర్థంగా ఎదుర్కోవచ్చని తెలిపారు. "ప్రజల భద్రతే మా ప్రాధాన్యత.. మీ జాగ్రత్తే మీ కుటుంబానికి రక్షణ" అనే సందేశంతో ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. తుపాను హెచ్చరికలు అమల్లో ఉన్నంతకాలం అప్రమత్తత కొనసాగించాలని ఆమె సూచించారు.

# ఏపీ లిక్కర్ స్కామ్ కేసు..
# రాజ్ కసిరెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట





**న్యూఢిల్లీ, రాజధాని వాయిస్** ఏపీలో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. కసిరెడ్డి అరెస్ట్ విధానం, ప్రొడక్షన్ వారెంట్‌పై ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. కసిరెడ్డికి ఏపీ హైకోర్టు మంజూరు చేసిన బెయిల్‌లో జోక్యానికి నిరాకరించింది. విచారణ పూర్తయ్యే వరకు నిందితుడు దేశం విడిచి వెళ్లకూడదని, పోలీసు దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరించాలంటూ సుప్రీంకోర్టు షరతు విధించింది. 'అరెస్టు చేయబోము' అని కోర్టులో హామీ ఇచ్చిన తర్వాత కూడా ప్రొడక్షన్ వారెంట్ జారీ చేయడంపై సుప్రీంకోర్టులో తీవ్ర వాదనలు జరిగాయి. హైకోర్టు తీర్పులోని కొన్ని వ్యాఖ్యలను అంగీకరించకపోయినా, నిందితుడి బెయిల్, స్వేచ్ఛను రద్దు చేయలేమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. పోలీసులు నేరుగా చేసే అరెస్ట్‌కు, కోర్టు జారీ చేసే ప్రొడక్షన్ వారెంట్‌కు తేడా ఉందని ధర్మాసనం తెలిపింది. ముందస్తు అనుమతి లేకుండా మళ్లీ అరెస్ట్ చేయకూడదన్న హైకోర్టు తీర్పులోని పేరా-23 నిబంధనలను న్యాయస్థానం సమర్థించింది. నిందితుడు విచారణకు సహకరించకపోతే బెయిల్ రద్దు కోసం కోర్టును ఆశ్రయించే స్వేచ్ఛ రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది.

# కూటమి అభ్యర్థులకు బీ-ఫారాల అందజేత




**నూజివీడు, రాజధాని వాయిస్ :** నూజివీడు నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన కూటమి బలపరిచిన జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులకు రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి బీ-ఫారాలు అందజేసి శు భాకాంక్షలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థులకు పార్టీ తరఫున అధికారికంగా పోటీ చేసేందుకు అవసరమైన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అభ్యర్థుల ఎన్నికల సన్నద్ధత, స్థానిక స్థాయిలో పార్టీ కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన అంశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. నాలుగు మండలాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు తమకు అప్పగించిన బాధ్యతలను గుర్తించి, ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగించాలని మంత్రి సూచించారు.ఎన్నికల్లో పోటీ చేయడం మాత్రమే కాకుండా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం కూడా ముఖ్యమని మంత్రి కొలుసు పార్థసారథి అభ్యర్థులకు సూచించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేసే దృక్పథంతో ముందుకు సాగాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక అవసరాలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రజలు తమపై ఉంచే నమ్మకాన్ని గౌరవిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, స్థానిక సమస్యలపై అవగాహన పెంచుకుని ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.కూటమి అభ్యర్థులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు. మండలాలు, గ్రామాల స్థాయిలో నాయకులు, కార్యకర్తల మధ్య సహకారం కొనసాగించాలని, ఎన్నికల కార్యక్రమాలను సమష్టిగా నిర్వహించాలని తెలిపారు. అభ్యర్థులు తమ ప్రాంతాల్లో ప్రజల అవసరాలను గుర్తించి, వాటికి అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలపై దృష్టి పెట్టాలని సూచించారు. సమన్వయంతో ముందుకు సాగడం ద్వారా స్థానిక సమస్యలపై సమర్థంగా స్పందించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, వారి అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు.స్థానిక సంస్థలు గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని మంత్రి పేర్కొన్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ప్రతినిధులు గ్రామీణ ప్రజల అవసరాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాల అమలులో భాగస్వాములు కావాల్సి ఉంటుందని సూచించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల అమలుపై నిరంతరం దృష్టి పెట్టాలని అభ్యర్థులకు తెలిపారు.

# అర్నబ్ తుపానుపై సర్వత్రా అప్రమత్తం

**అమరావతి, రాజధాని వాయిస్ :** అర్నబ్ తుపాను ముప్పు నేపథ్యంలో ఆంధ్రప్ర దేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. తుపాను కదలికలు, వర్షాల తీవ్రత, తీర ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్, హోంమంత్రి అనిత నిరంతరం సమీక్షిస్తున్నారు. అక్టోబర్ 27 మధ్యాహ్నం 12.30 గంటల నాటికి తుపాను విశాఖపట్నానికి సుమారు 215 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్నట్లు ప్రభుత్వ సమాచారం వెల్లడించింది. మరుసటి రోజు ఉదయం యానాం సమీపంలో తీరం దాటే సూచనలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. తీర ప్రాంతాల్లో సముద్రపు అలలు ఉవ్వెత్తున ఎగసిపడే అవకాశం ఉందని, ఒకటి నుంచి రెండు మీటర్ల ఎత్తు వరకు అలలు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరికలు జారీ చేశారు. ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. జిల్లాల వారీగా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసర మైన ఏర్పాట్లు చేస్తున్నారు.తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగవంతం చేసేందుకు జాతీయ విపత్తు స్పందన దళానికి చెందిన 12 బృందాలు, రాష్ట్ర విపత్తు స్పందన దళానికి చెందిన 10 బృందాలను 14 జిల్లాలకు తరలించినట్లు ప్రభుత్వ సమాచారం పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా 20 జిల్లాల్లో 2,131 తుపాను పునరావాస కేంద్రాలను సిద్ధం చేశారు. తుపాను హెచ్చరికలను ప్రజలకు వేగంగా చేరవేసేందుకు 18 జిల్లాల్లో సుమారు 2.70 కోట్ల మొబైల్ ఫోన్లకు నిరంతరం హెచ్చరికలు పంపించే ఏర్పాట్లు చేశారు. సముద్రంలోకి వెళ్లకుండా తీర ప్రాంతాల్లో 30,043 చేపల వేట పడవలను నిలిపివేశారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవ ద్దని, ఇప్పటికే సముద్రంలో ఉన్నవారు సురక్షితంగా ఒడ్డుకు చేరుకోవాలని అధికారు లు సూచించారు. తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తం గా ఉండాలని, అవసరమైతే అధికారుల సూచనల మేరకు పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని కోరారు. తుపాను ప్రభావం తగ్గేవరకు ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా అధికారులకు సూచించారు.వైద్య సేవలకు అంతరాయం కలగకుండా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో 1,087 వైద్య బృందాలను ఏర్పాటు చేశారు. అత్యవసర చికిత్సల కోసం 8,281 పడకలు, 1,274 అంబులెన్సులను సిద్ధంగా ఉంచారు. వరదలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో పాముకాట్ల ప్రమాదం



పెరిగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ఆసుపత్రుల్లో 21,536 యాంటీ స్నేక్ వీనం మోతాదులను అందుబాటులో ఉంచారు. గర్భిణులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా 1,351 మందిని ఇప్పటికే ఆసుపత్రులకు సురక్షితంగా తరలించినట్లు అధికారులు తెలిపారు. తాగునీటి సరఫరా కోసం 2,613 నీటి ట్యాంకర్లు, విద్యుత్తు అంతరాయాల సమయంలో అవసరాల కోసం 2,430 జనరేట ర్లు, నీటి శుద్ధి కోసం 4,448 ఆర్వో ప్లాంట్లను సిద్ధం చేశారు. ప్రజలకు అవసరమైన మందులు, వైద్య సదుపాయాలు, తాగునీరు నిరంతరం అందేలా సంబ ంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. అత్యవసర వైద్య సేవలు అవసరమై నవారిని గుర్తించి సకాలంలో చికిత్స అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు కొనసాగుతు న్నాయి .ప్రజలకు నిత్యావసర వస్తువుల కొరత రాకుండా 14,686 రేషన్ దుకాణాల్లో రెండు నెలలకు సరిపడా సరుకులను ముందుగానే నిల్వ చేసినట్లు ప్రభుత్వ సమాచారం వెల్లడించింది. తుపాను కారణంగా పంటలకు నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకో వాలని 35.96 లక్షల మంది రైతులకు సూచనలు జారీ చేశారు. ప్రభుత్వ వసతి గృహాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, ముఖ్యంగా 419 గిరిజన వసతి గృహాల్లోని 88,083 మంది విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పా ట్లు చేశారు. రహదారులపై చెట్లు పడిపోవడం, రాకపోకలకు అంతరాయం ఏర్పడటం వంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు రోడ్లు, భవనాల శాఖ 550 జేసీబీలు, 596 విద్యుత్తు రంపాలను సిద్ధంగా ఉంచింది.

# అర్నాబ్ తుఫాన్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**గుంటూరు, రాజధాని వాయిస్ :** అర్నాబ్ తుఫాన్ కారణంగా బుధవారం భారీ వర్షాలు కురుస్తాయని, తీవ్ర గాలులు ఉంటాయని ప్రజల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ కోరారు. అత్యవసర పనులు ఉంటే మినహా బయటకు రావద్దని సూచించారు. అర్నాబ్ తుఫాన్ పై కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం మీడియా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాసంస్థలకు బుధవారం, 28వ తేదీన సెలవు ప్రకటించినట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలకు ఇప్పటికే మూడు రోజులు పాటు సెలవును ప్రకటించడం జరిగిందని చెప్పారు. తుఫాను తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని, దీనిపై జిల్లా యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉందని తెలిపారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించామని, అవసరమైతే ఇప్పటికే సిద్ధం చేసిన 34 పునరావాస కేంద్రాలకు వెంటనే తరలించడం జరుగుతుందని చెప్పారు. వృద్ధులు చిన్నారులు గర్భిణీలు బాలింతల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించినట్లు చెప్పారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పూర్తి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రకాశం బ్యారేజీ నీటి నిల్వలు, వివిధ వాగుల ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు జల వనరుల శాఖ పర్యవేక్షణ చేస్తుందని, ఎక్కడైతే గట్లు బలహీనంగా ఉన్నాయో వాటిని గుర్తించాలని, అటువంటి చోట్ల ఇసుక బస్తాలు సిద్ధం వేయాలని ఆదేశించినట్లు తెలిపారు. గాలులకు హోర్డింగులు, ఫ్లెక్సీలు పడిపోయే అవకాశం ఉన్నందున వాటిని తొలగించడం జరుగుతుందని అన్నారు. తాగునీటి పథకాలు పూర్తి స్థాయిలో నింపుకోవడంతోపాటు, వాటి వద్ద జనరేటర్లు సిద్ధంగా పెట్టుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. త్రాగునీరు ఎటువంటి పరిస్థితుల్లో కలుషితం కాకుండా క్లోరినేషన్ జరగాలని ఆదేశించామని అన్నారు. రహదారులు భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖలను, విపత్తు నిర్వహణ శాఖ, విద్యుత్, రవాణా, పౌర సరఫరాల శాఖ తదితర శాఖలు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. టెలికాం, మొబైల్ సేవలకు ఎటువంటి అంతరాయం కలగకుండా సంబంధిత టెలికం కంపెనీలు ముందస్తుగానే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రేషన్ దుకాణాల్లో రెండు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులు సిద్ధం చేసినట్లు చెప్పారు. అర్నాబ్ తుఫాన్ పట్ల రైతులను అప్రమత్తం చేయాలని అవసరమైన సూచనలు సలహాలను అందించాలని వ్యవసాయ ఉద్యానవన శాఖలను ఆదేశించామన్నారు. పశువులకు సురక్షిత ప్రాంతాలకు తరలించడంతోపాటు వాటికి తగిన ఆహారము అందే విధంగా పశుసంవర్ధక శాఖ చర్యలు చేపట్టడం జరిగిందని అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 08632234014 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని అన్నారు. రేయింబవళ్ళు పర్యవేక్షణకు సిబ్బందిని నియమించడం జరిగిందని చెప్పారు. ఎన్నికల పనులను నిర్వహిస్తూనే మరో ప్రక్క తుఫాను పర్యవేక్షణ పనులు సమర్థవంతంగా నిర్వహించుటకు కృషి చేస్తున్నామని చెప్పారు.

**ఆసుపత్రుల వద్ద విద్యుత్ ఆటంకం లేకుండా చూడాలి**

ఆసుపత్రుల వద్ద ముఖ్యంగా అత్యవసర వైద్య సేవలు, ఆపరేషన్ థియేటర్ల వద్ద ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖను ఆదేశించినట్లు తెలిపారు. హై రిస్క్ లో ఉన్న గర్భిణీ స్త్రీలను ముందుగానే ఆసుపత్రులకు తరలించాలని ఆదేశించారు. వైద్య సేవలకు ఎటువంటి అంతరాయము ఉండరాదని స్పష్టం చేశారు.

**వాగులు, వంకలు, నదులు దాటవద్దు**

వాగులు, వంకలు, నదులు ఎవరు దాటువద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తుఫాను తీవ్రత ఉండటం, నీటి ప్రవాహాలు పెరగటం జరుగుతుందని చెప్పారు. జల ప్రవాహాలు దగ్గర ఈతకు వెళ్లడం, చేపలు పట్టుటకు వెళ్లడం చేయరాదని కోరారు. ఈ మీడియా ప్రతినిధుల సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి పాల్గొన్నారు.

# వాళ్లపై ఆధారపడి టీడీపీ మనుగడ..: లేళ్ల అప్పిరెడ్డి




**విజయవాడ, రాజధాని వాయిస్ :** ఏపీలో స్థానిక ఎన్నికల వేళ జరుగుతున్న బెదిరింపులపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. అన్ని ఆధారాలను స్టేట్ ఎలక్షన్ కమిషనర్‌కు ఇచ్చామని తెలిపారు. ఎన్నికల సంఘానని కలిసిన తర్వాత లేళ్ల అప్పిరెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు."అభ్యర్థుల ఇళ్ల ముందుకు వెళ్లి నామినేషన్ వేయడానికి రండి అని పోలీసులు ప్రచారం చేశారని చంద్రబాబు చెబుతున్నారు. నామినేషన్ వెయ్యలేని పరిస్థితి.. వేసినా రకరకాల కారణాలతో రిజెక్ట్ చేశారు. అభ్యర్థనలు చేసిన అధికారులు పెట్టించుకోలేదు. ఎక్స్ మేయర్ అజీజ్ సీఐకి ఫోన్ చేసి డబ్బులు నీ దగ్గరకి పంపుతున్న జీప్ లో పెట్టుకోవాలనిని చెబుతున్నారు. గూడూరు డీఎస్పీ నరసింహ మూర్తి వైస్సార్‌సీపీ అభ్యర్థులను బయపెట్టడానికి బెదిరిస్తున్నారు. బరితెగింపునకు అంతం ఉంటుందా? వ్యవస్థలు కునారిల్లుతున్న పరిస్థితి ఎప్పుడూ చూడలేదు. భయపట్టడం, ప్రలోభ పెట్టడం, పోలీసులపై ఆధారపడి టీడీపీ మనుగడ సాగిస్తుంది. అధికారులను అడ్డం పెట్టుకొని టీడీపీ ముందుకు వెళ్తుంది. ఏఫైల్ ఎలా రాయలో అనంతపురం టీడీపీ నేత చెబుతున్నారు. గూండాలు కత్తులతో బయటికివచ్చి నూజివీడులో వీరంగం సృష్టిస్తున్నాడు. పల్నాడులో ఫేక్ అభ్యర్థులు నామినేషన్ల కొనసాగిస్తున్నారు" అని తెలిపారు.

**నానా హంగామా చేస్తున్నారు..**

మునిపాలిటీని ఎంచుకుని రౌడీలను, గుండాలను రప్పించి నానా హంగామా చేస్తున్నారని లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. "స్థానిక ఎన్నికల్లో ఓటర్లు మాత్రమే ఉండాలి.. ఆ విధంగా చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్ ని కోరాం. ఎన్నికల తీర్పు ప్రభుత్వ పనితనానికి, ఏ విధంగా పని చేస్తున్నది అన్న దానికి కొలమానంగా చూస్తాం. గూడూరు డీఎస్పీని వెంటనే సస్పెండ్ చేయాలని కోరాం. నెల్లూరు సీఐని సస్పెండ్ చేయాలి. వెలుగులోకి రాని పోలీస్ అధికారుల బెదిరింపులు చాలా ఉన్నాయి. ఈ ఎన్నికలతోనే భవిష్యత్తు మారుతుందని వైఎస్సార్‌సీపీ భావించడం లేదు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగాలనే మా పోరాటం. రాజుజలో న్యాయం జరగకపోతే సుప్రీంకోర్టు మెట్లు ఎక్కుతాం. ఎన్నికల్లో మార్పు రాకపోతే మేము అధికారంలోకి రాగానే విచారణ చేస్తాం. తప్పు చేసిన వాళ్లపై చర్యలు తీసుకొంటాం" అని అన్నారు. మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు మాట్లాడుతూ.. "పునేఠా ఎన్నికల కమిషనర్‌గా ఉన్నారు. న్యాయం జరుగయితుంది అని అనుకొన్నాం. పోలీసులు DSP స్థాయి వాళ్లు, CI స్థాయి అధికారులు బేరం పెట్టేశారు. పోలీసుల తీరుపై అన్ని ఆధారాలు ఇచ్చాం. ఎన్నికలను రద్దు చేయాలని సుప్రీంకోర్టును కోరుతున్నాం. పవన్‌కు ఆయన వాటా వచ్చింది. జనసేన టికెట్స్ వాటా కాదు. మాధవ్‌కు కూడా ఏవో విసిరినట్లు ఉన్నారు. పోటీలో కుటమి మూడు పార్టీలు లేవు. కేవలం వున్నది ఒకటే పార్టీ అది టీడీపీ" అని చెప్పారు.

# పల్నాడు జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్!



**వినుకొండ, రాజధాని వాయిస్ :** మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి స్ట్రాంగ్ రూములు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, కౌంటింగ్ కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని పల్నాడు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కృతిక శుక్ల అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో మంగళవారం వినుకొండ పట్టణంలోని లయోలా హైస్కూల్‌లో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాన్ని, నిర్మల హైస్కూల్‌లోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కౌంటింగ్ కేంద్రంలో టేబుళ్ల ఏర్పాటు, బ్యారికేడింగ్, రిసెప్షన్‌తో పాటు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్‌కు ఎన్ని టేబుళ్లు ఏర్పాటు చేయాలి, ఎన్ని రౌండ్లలో లెక్కింపు చేపట్టాలి అనే అంశాలపై స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ సమయంలో వర్షం కురిసినా ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాళ్లకు తరలించే సమయంలో ఏ పోలింగ్ కేంద్రానికి సంబంధించిన బాక్సులను ఏ టేబుల్ వద్దకు పంపించాలనే అంశంపై ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. బాక్సుల తరలింపులో ఎలాంటి గందరగోళం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, సిబ్బందికి అవసరమైన వసతులు కల్పించి, నిర్దేశిత గడువులోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# పోలీసు అమరవీరుల కుటుంబాలకు అండగా శాఖ

**విజయవాడ, రాజధాని వాయిస్ :** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు--2026లో భాగంగా విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులతో నగర పోలీసు కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. అమరవీరుల కుటుంబాలకు అందాల్సిన సంక్షేమ ప్రయోజనాలు, పెండింగ్‌లో ఉన్న బకాయిలపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసుల కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని ఈ సమావేశం ద్వారా మరోసారి గుర్తు చేశారు. కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టేందుకు సమావేశం నిర్వహించారు. సమావేశంలో అమరవీరుల కుటుంబాల కు ఇంకా అందాల్సిన ప్రయోజనాలు, పరిష్కారం కావాల్సిన పెండింగ్ అంశాలపై సమీక్షించారు. సంక్షేమ పథకాల ద్వారా అందాల్సిన సహాయం సకాలంలో అందుతోందా అనే విషయాన్ని పరిశీలించారు. ఏవైనా ప్రయోజనాలు ఆలస్యమవుతున్నట్లయితే వాటికి గల కారణాలను గుర్తించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవా లని సంబంధిత అధికారులకు సూచించారు. కుటుంబ సభ్యులకు ప్రభుత్వపరంగా, శాఖాపరంగా అందాల్సిన సహాయంలో జాప్యం లేకుండా చూడాల్సిన అవసరాన్ని కమిషనర్ ప్రస్తావించారు. వారి సమస్యలను సానుకూలంగా పరిశీలించి, పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

# ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ తనిఖీలు

- పంపిణీ కేంద్రంలో సామగ్రి సిద్ధంగా ఉంచాలి
- స్ట్రాంగ్ రూమ్‌లు, లెక్కింపు కేంద్రాల పరిశీలన
- రూట్ల వారీగా వాహనాల ఏర్పాటు
- సీసీ కెమెరాలు, భద్రతా చర్యలు పకడ్బందీగా ఉండాలి



**గుంటూరు, రాజధాని వాయిస్ :** స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి.యం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో మంగళవారం గుంటూరులోని ఆంధ్రా ముస్లిం కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న భద్రపరిచే గదులు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్ల పురోగతిని పరిశీలించి, వివిధ విభాగాల అధికారులు చేపట్టిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో అవసరమైన వస్తువులను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ సిబ్బందికి అందించాల్సిన సామగ్రిని ముందుగానే సరిచూసి, నియోజకవర్గాలు, మార్గాల వారీగా వర్గీకరించాలని ఆదేశించారు. ఎన్నికల విధులకు వెళ్లే సిబ్బంది, వాహనాలకు సంబంధించి స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. మార్గాల వారీగా వాహనాలను సిద్ధంగా ఉంచి, సిబ్బంది నిర్ణీత సమయానికి తమ విధులకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సిబ్బందికి అవసరమైన భోజన వసతులు కల్పించాలని, పంపిణీ కేంద్రంలో ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.ఎన్నికల సామగ్రి స్వీకరణ, పంపిణీ సమయంలో రద్దీ ఏర్పడకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సిబ్బంది సామగ్రిని తీసుకునేందుకు ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా తగిన సంఖ్యలో కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. సామగ్రి పంపిణీ ప్రక్రియలో స్పష్టమైన విధానాన్ని అనుసరిస్తూ, ప్రతి బృందానికి అవసరమైన వస్తువులు సక్రమంగా అందేలా చూడాలని పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి అవసరమైన సమాచారం, మార్గదర్శకాలు ముందుగానే అందించడం ద్వారా చివరి నిమిషంలో ఎదురయ్యే సమస్యలను నివారించవచ్చని తెలిపారు.ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న భద్రపరిచే గదులు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల సామగ్రి, ఓట్లకు సంబంధించిన పత్రాల భద్రతకు అవసరమైన ఏర్పాట్లు పటిష్ఠంగా ఉండాలని సూచించారు. భద్రపరిచే గదులు, లెక్కింపు హాళ్ల వద్ద నిఘా కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, వాటి పనితీరును నిరంతరం పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సిబ్బంది నిర్వహణ, భద్రతా ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.లెక్కింపు కేంద్రాల వద్ద మీడియా కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, సమాచార ప్రసారం సజావుగా జరిగేలా అవసరమైన సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని తెలిపారు. పంపిణీ కేంద్రం నుంచి ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలో సమన్వయంతో పనిచేస్తూ, ఎన్నికల నియమావళికి అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. తనిఖీలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్, రెవెన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీనివాసరావు, జిల్లా పరిషత్‌ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి. జ్యోతిబసు పాల్గొన్నారు.

# నెల్లిమర్లలో కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం




**నెల్లిమర్ల, రాజధాని వాయిస్ :** నెల్లిమర్ల నగర పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కూటమి అభ్యర్థులకు మద్దతుగా శాసనసభ్యు రాలు లోకం మాధవి విస్తృత ప్రచారం నిర్వహించారు. నగర పంచాయతీలోని 18వ వార్డులో జనసేన పార్టీ అభ్యర్థి జానా సంధ్యారాణి, కూటమి చైర్మన్ అభ్యర్థి మైపాడ ప్రసాద్‌కు మద్దతుగా ఆమె ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని స్థానిక ప్రజలను కోరారు. వార్డులోని ప్రజలతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ, ఎన్నికల్లో తమకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ప్రచారంలో భాగంగా లోకం మాధవి స్థానికులతో మమేకమై కూటమి అభ్యర్థుల గెలుపు ఆవశ్యకతను వివరించారు. నెల్లిమర్ల నగర పంచాయతీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపడం కూటమి ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. స్థానికంగా అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని ప్రచారంలో వివరించారు. 18వ వార్డు నుంచి పోటీ చేస్తున్న జానా సంధ్యారాణికి ప్రజలు అండగా నిలవాలని ఎమ్మెల్యే కోరారు. వార్డు అభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారం, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఓటర్లు తమ నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కూటమి అభ్యర్థులను గెలిపించడం ద్వారా స్థానిక సమస్యలపై మరింత సమర్థంగా స్పందించేందుకు అవకాశం కలుగుతుందని ఆమె ప్రజలకు వివరించారు.నగర పంచాయతీ చైర్మన్ పదవికి కూటమి తరఫున పోటీ చేస్తున్న మైపాడ ప్రసాద్‌కు కూడా మద్దతు ఇవ్వాలని లోకం మాధవి కోరారు. నెల్లిమర్ల సమగ్ర అభివృద్ధికి కూటమి కట్టుబడి ఉందని, ప్రజల అవసరాలకు ప్రాధాన్యం ఇస్తూ పాలన సాగించాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తోందని తెలిపారు. వార్డులవారీగా ప్రజలను కలుసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలు, స్థానిక సమస్యలు, ప్రజల ఆశలు, ఆకాంక్షలను తెలుసుకోవడమే ప్రచారం ప్రధాన ఉద్దేశమని వివరించారు.నెల్లిమర్ల నగర పంచాయతీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. ఇంటింటి ప్రచారం ద్వారా ఓటర్లను నేరుగా కలుసుకుంటూ తమ అభ్యర్థులకు మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో 18వ వార్డులో లోకం మాధవి నిర్వహించిన ప్రచారం ద్వారా జానా సంధ్యారాణి, మైపాడ ప్రసాద్‌లకు మద్దతు ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో ఓటర్లు ఇచ్చే తీర్పు నెల్లిమర్ల నగర పంచాయతీ భవిష్యత్తు అభివృద్ధి దిశను నిర్ణయించనుందని కూటమి నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# అర్నబ్ తుపానుపై అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన



**కాకినాడ, రాజధాని వాయిస్ :** పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నబ్ తుపాను ప్రభావం నేపథ్యంలో క్షేత్రస్థాయి లో పరిస్థితులను పరిశీలించేందుకు కాకినాడ జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్ సంయుక్తంగా తాళ్లరేవు మండలం గాడిమొగలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. తుపాను ప్రభావం కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయో తెలుసుకోవడంతో పాటు, ముందస్తు జాగ్రత్తల అమలును పరిశీలించడంపై అధికారులు దృష్టి సారించారు.తుపాను పరిస్థితుల నేపథ్యంలో ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో పర్యటిస్తోంది. ఈ క్రమంలో కలెక్టర్, ఎస్పీ గాడిమొగలోని పునరావాస కేంద్రానికి చేరుకుని అక్కడి పరిస్థితులను పరిశీలించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చేసిన ఏర్పాట్లను సమీక్షించారు. తుపాను ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని ఈ పర్యటన స్పష్టం చేసింది.పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందే ప్రజలకు అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉండటం కీలకమని అధికారులు భావిస్తున్నారు. తుపాను సమయంలో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను తగ్గించేందుకు తాగునీరు, ఆహారం, వైద్య సహాయం, పారిశుద్ధ్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి అవసరం. గాడిమొగలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని పరిశీలించడం ద్వారా అక్కడి ఏర్పాట్లపై అధికారులు క్షేత్రస్థాయి అవగాహన పొందారు. అయితే కేంద్రంలో అందుబాటులో ఉన్న సదుపాయాలు, ఆశ్రయం పొందుతున్న ప్రజల సంఖ్యకు సంబంధించిన వివరాలు వెల్లడికాలేదు.తాళ్లరేవు మండలంలోని తీర ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులను నిరంతరం గమనించడం, ప్రజలకు అవసరమైన హెచ్చరికలను సకాలంలో చేరవేయడం ముఖ్యమైన అంశాలుగా ఉన్నాయి. తుపాను తీవ్రతను బట్టి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధంగా ఉంచాలని, అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంది. జిల్లా కలెక్టర్, ఎస్పీ సంయుక్త పర్యటనలో భాగంగా పునరావాస కేంద్రాన్ని పరిశీలించడం ఈ ఏర్పాట్ల ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది.అర్నబ్ తుపాను ప్రభావం నేపథ్యంలో కాకినాడ జిల్లాలోని సంబంధిత ప్రాంతాలపై అధికారుల పర్యవేక్షణ కొనసాగుతోంది. తుపాను పరిస్థితుల్లో ప్రజలు అధికారిక సూచనలను పాటించాలని, సముద్రం వైపు వెళ్లడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని అధికారులు అవగాహన కల్పించడం అవసరం. వాతావరణ పరిస్థితుల్లో మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, అవసరమైనప్పుడు సహాయక చర్యలు చేపట్టేందుకు శాఖల మధ్య సమన్వయం కీలకం కానుంది. గాడిమొగ పునరావాస కేంద్రాన్ని కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎస్పీ బిందు మాధవ్ పరిశీలించడం తుపాను వేళ ప్రజల భద్రతపై యంత్రాంగం దృష్టి సారించినట్లు సూచిస్తోంది.

## మూడో వార్డులో చెప్పాం చేస్తున్నాం కార్యక్రమం



**సత్తెనపల్లి.అక్టోబర్ 27 రాజధాని వాయిస్ :** పట్టణం లోని మూడో వార్డులో మంగళవారం నిర్వహించిన చెప్పాం.. చేస్తున్నాం కార్యక్రమంలో జనసేన పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి కేతావత్ పార్వతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలను కలిసి కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. వార్డు సమస్యలు, అభివృద్ధి అంశాలపై ప్రజలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పురుషోత్తం నాయక్, షారోన్ కుమార్, శరత్ నాయక్, సురేష్ నాయక్, జైపాల్, సైదా, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## బీసీ విద్యార్థుల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

**బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆదేశం**



**అమరావతి.అక్టోబర్ 27 రాజధాని వాయిస్ :**అర్నాబ్ తుఫాన్ నేపథ్యంలో బీసీ హాస్టళ్లు, గురుకులాల విద్యార్థుల భద్రత, ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత అధికారులను ఆదేశించారు. మంగళవారం బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, ఎంజేపీ గురుకులాల కార్యదర్శి మాధవీలతతో ఫోన్‌లో మాట్లాడి పలు సూచనలు చేశారు. తుఫాన్ ప్రభావంతో 15 జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాష్ట్ర స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. బలహీనమైన భవనాల్లోని విద్యార్థులను సురక్షిత భవనాలకు తరలించాలని, విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థులకు వేడి చేసి చల్లార్చిన నీరు, తాజా ఆహారం మాత్రమే అందించాలని, బయటి ఆహారాన్ని హాస్టళ్లు, గురుకులాల్లోకి అనుమతించవద్దని స్పష్టం చేశారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడంతో పాటు తరగతి గదులు, విశ్రాంతి గదుల్లో పొడి వాతావరణం ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులకు స్వల్ప అస్వస్థత కలిగినా వెంటనే సమీప ఆసుపత్రులకు తరలించాలని, అవసరమైన చోట సిబ్బంది సెలవులు రద్దు చేసి విధుల్లో అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు సైతం ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బీసీ విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోవాలని మంత్రి సవిత స్పష్టం చేశారు.

## తీర ప్రాంతాల్లో జోరు వానలో హోంమంత్రి అనిత పర్యటన

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపు



**నక్కపల్లి.అక్టోబర్ 27రాజధాని వాయిస్ :**అర్నబ్ తుపాను ముందస్తు చర్యల్లో భాగంగా హోంమంత్రి వంగలపూడి అనిత పాయకరావుపేట నియోజకవర్గంలోని యస్.రాయవరం మండలం రేవుపోలవరం, నక్కపల్లి మండలం బోయపాడు గ్రామాల్లో జోరువానలోనే పర్యటించారు.అక్కడ ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించి బాధితులకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.తీరంలో మత్స్యకారులతో మాట్లాడిన మంత్రి, తుపాను ప్రభావం తగ్గే వరకు చేపల వేటకు వెళ్లరాదని, బలమైన గాలుల దృష్ట్యా ప్రజలంతా ఇళ్లలోనే ఉండాలని సూచించారు. అనంతరం నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించి పరిస్థితులను సమీక్షించారు. అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సహాయక చర్యలు చేపట్టాలని, ప్రజలు కూడా అధికారుల హెచ్చరికలు పాటిస్తూ బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు.

# గుంటూరు ప్రగతికి సహకరించండి.. లక్ష్మీ అపర్ణ విజ్ఞప్తి

బ్రాడీపేటలో ప్రచార హోరు.. గుంటూరు అభివృద్ధిపై కూటమి భరోసా
గుంటూరులో వేల కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు: కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
మేయర్ అభ్యర్థి లక్ష్మీ అపర్ణ, కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి



**గుంటూరు, అక్టోబర్ 27 :** గుంటూరునగర కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బ్రాడీపేటలో కూటమి నాయకులు విస్తృతంగా పర్యటించారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, కూటమి మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణతో పాటు పలువురు కూటమి నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులను ఆత్మీయంగా పలకరిస్తూ నగర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.ఈ సందర్భంగా మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందన్నారు. ఇప్పటికే నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, రానున్న రోజుల్లో గుంటూరును మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే గల్లా మాధవి మార్గదర్శకత్వంలో నగర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధనకు ప్రజల సహకారం ఎంతో అవసరమని అన్నారు.నవంబర్ 1న జరిగే ఎన్నికల్లో తనకు, 76 డివిజన్ల కార్పొరేటర్ అభ్యర్థులకు ఓటు వేసి మద్దతు అందించాలని లక్ష్మీ అపర్ణ విజ్ఞప్తి చేశారు.

**కేంద్ర సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు**

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, గుంటూరు నగరంలో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో పలు రైల్వే ఓవర్ బ్రిడ్జిలు (ఆర్‌ఓబీలు) నిర్మిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనేక విధాలుగా సహకారం అందిస్తోందన్నారు. గుంటూరు నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణతో పాటు కూటమి కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించి, అఖండ మెజారిటీ అందించాలని ప్రజలను కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు, రాష్ట్ర సహ ఇన్‌చార్జి వనతి శ్రీనివాసన్, జిల్లా ఇన్‌చార్జి దొరబాబు, బీజేపీ అధికార ప్రతినిధి యామిని శర్మ, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు శనక్కాయల రాధా మాధవి, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి హరి పావని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నడ్డి నాగమల్లేశ్వరి, రాష్ట్ర అధికార ప్రతినిధి బొల్లాప్రగడ శ్రీదేవి, 41వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి గాయత్రి బెహరా, 43వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి గాయత్రి, జిల్లా ప్రధాన కార్యదర్శి భజరంగ్ రామకృష్ణ, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ వెలగలేటి గంగాధర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## చెప్పాం.. చేస్తున్నాం.. అన్న క్యాంటీన్ల ద్వారా ప్రతి ఒక్కరి ఆకలి తీరుస్తున్నాం



**మంగళగిరి, రాజధాని వాయిస్ :** 2019 నుంచి 2024 వరకు రాష్ట్రంలో నడిచిన వైసీపీ పాలనలో సాగిన అరాచకాలు, దుర్మార్గాలు, ప్రజా వ్యతిరేక విధానాలను రాష్ట్ర ప్రజలంతా చూశారని ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్ మండిపడ్డారు. అన్నింటికంటే మించి, ఒక మనిషి ఇంత దారుణంగా దిగజారగలడా అని యావత్ సమాజం ఛీత్కరించుకునే నీచమైన పనిని ముఖ్యమంత్రి హోదాలో ఉండి జగన్మోహన్ రెడ్డి చేశారని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సహజంగా కనీస మానవత్వం ఉన్న ఏ వ్యక్తైనా ఆకలితో ఉన్నవారిని చూస్తే పిడికెడు అన్నం పెట్టాలని అనుకుంటాడు. మన కడుపు నిండినప్పుడు పక్కన ఉన్నవాడు ఆకలితో అలమటిస్తుంటే ఒక ముద్ద అన్నం పెట్టడం మన సంస్కృతి. ఒకవేళ పెట్టలేని నిస్సహాయ స్థితిలో ఉన్నా అయ్యో పెట్టలేకపోయామే అని బాధపడతాం తప్ప, తింటున్న వాడి చేతిలోంచి కంచాన్ని లాక్కోవాలని ఏ మానవుడూ అనుకోడు. కానీ గత ఐదేళ్ల పాలనలో జగన్మోహన్ రెడ్డి సరిగ్గా అదే పని చేశారు. పేదలు తింటున్న కంచాన్ని బలవంతంగా లాక్కొని విసిరిపారేశారు. చేతనైతే అన్నం పెట్టాలి, కానీ ఆకలితో ఉన్న పేదవాడి ఎదురుగా ఉన్న తిండి గిన్నెను లాక్కుని విసిరేసే వాడిని సమాజంలో ఏమంటారు? పక్కా సైకో అంటారు. కనీస కనికరం, మానవత్వం లేని రాక్షస ప్రవర్తన అది. సరిగ్గా అలాంటి సైకో మనస్తత్వంతోనే జగన్మోహన్ రెడ్డి పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లను మూసివేయించి, పేద ప్రజల నోటికాడి ముద్దను నిర్దాక్షిణ్యంగా లాక్కున్నారు. ఇంతకంటే ఘోరమైన, నీచమైన చర్య మరొకటి ఉండదని పట్టాభిరామ్ నిప్పులు చెరిగారు.

**అన్న ఎన్టీఆర్ ఆశయాలకు నిలువెత్తు రూపం అన్న క్యాంటీన్లు.. పేదవాడి ఆకలి తీర్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం**

రాష్ట్రంలో ఏ ఒక్క పేదవాడూ ఆకలితో అలమటించకూడదన్న పవిత్ర సంకల్పంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించిన 'అన్న క్యాంటీన్లు' నేడు పేదల కడుపు నింపుతూ ఆదర్శంగా నిలుస్తున్నాయని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పేర్కొన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఆగస్టు 2024లో అన్నా క్యాంటీన్లను పునఃప్రారంభించి రికార్డు స్థాయిలో పేదలకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నామని ఆయన తెలిపారు. 2014-19 మధ్య అన్న నందమూరి తారక రామారావు స్ఫూర్తితో చంద్రబాబు నాయుడు గారు అన్నా క్యాంటీన్లకు శ్రీకారం చుట్టారు. జేబులో కేవలం రూ. 5 ఉంటే చాలు.. పేదవాడు, రైతు, కార్మికుడు, మహిళ, విద్యార్థి అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ కడుపునిండా గౌరవంగా భోజనం చేసే వెసులుబాటు కల్పించారు. కానీ గత వైసీపీ పాలనలో జగన్మోహన్ రెడ్డి సైకోలా వ్యవహరించి, పేదల నోటికాడి ఆ అన్నాన్ని కూడా నిర్దాక్షిణ్యంగా లాక్కున్నారు. మద్యం, ఇసుక, మైనింగ్ దోపిడీలే కాకుండా, నిరుపేదల ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్లను మూసివేసి అత్యంత దారుణంగా దిగజారారు. ఆ రోజున మేము ప్రజలకు మాట ఇచ్చాం చంద్రబాబు నాయుడు మళ్లీ ముఖ్యమంత్రి కాగానే అన్నా క్యాంటీన్లను పునఃప్రారంభిస్తామని చెప్పాం. చెప్పిన మాట ప్రకారం ఆగస్టు 2024లోనే తిరిగి తెరిచాం. 'చెప్పాం.. చేస్తున్నాం' అన్నదే మా నినాదం. చేసిన అభివృద్ధిని, అందించిన సంక్షేమాన్ని ప్రజల ముందుంచి తలెత్తుకుని స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆశీర్వదించమని అడుగుతున్నాం. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కలిపి 273 అన్నా క్యాంటీన్లు విజయవంతంగా నడుస్తున్నాయి. ఇందులో పట్టణ ప్రాంతాల్లో 205, గ్రామీణ ప్రాంతాల్లో 68 క్యాంటీన్లను ఏర్పాటు చేశాం. అక్షయపాత్ర ఫౌండేషన్ భాగస్వామ్యంతో అత్యాధునిక, పరిశుభ్రమైన వంటశాలల ద్వారా అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు, భద్రత పాటిస్తూ మూడు పూట్లా రుచికరమైన, పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నాం. అన్నా క్యాంటీన్లు పేదలకు అన్నం పెట్టే దేవాలయాలని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నోసార్లు సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతో పాటు నారా భువనేశ్వరి, మంత్రి నారా లోకేష్, కూటమి ప్రజాప్రతినిధులంతా తరచూ అక్కడ భోజనం చేస్తూ నాణ్యతను పరిశీలిస్తున్నాం. ఆగస్టు 2024 నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 12 కోట్ల 60 లక్షల మందికి పైగా అన్న క్యాంటీన్ల ద్వారా భోజనం చేశారు. ఉదయం అల్పాహారం 4 కోట్ల 82 లక్షల మంది, మధ్యాహ్న భోజనం 5 కోట్ల 60 లక్షల మంది, రాత్రి భోజనం 2 కోట్ల 22 లక్షల మంది ఇంత భారీ స్థాయిలో పేదల ఆకలి తీరుస్తుండటం చంద్రబాబు ప్రజాహిత పాలనకు నిదర్శనం. పేద ప్రజల సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యంగా కూటమి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని పట్టాభిరామ్ స్పష్టం చేశారు.

## 9వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ విస్తృత ప్రచారం

**- ఫ్యాన్ గుర్తుపై ఓటేసి టీ.వాణి సరోజను గెలిపించాలని అభ్యర్థన**

**గుంటూరు,రాజధాని వాయిస్** గుంటూరు నగరంలోని 9వ డివిజన్ కొత్తపేట మంగళబావి సందులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి టీ.వాణి సరోజ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం మంగళవారం ఉత్సాహంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి రాంబాబు, గుంటూరు నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ స్థానిక ప్రజలను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా టీ.వాణి సరోజకు 'ఫ్యాన్' గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



## 30వ వార్డులో స్వతంత్ర అభ్యర్థి షేక్ నాగూర్ షరీఫ్ ప్రచారం



**మాచర్ల.అక్టోబర్ 27 రాజధాని వాయిస్ :** మాచర్ల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 30వ వార్డు స్వతంత్ర అభ్యర్థి షేక్ నాగూర్ షరీఫ్ వార్డు పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానిక ప్రజలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకుంటూ ఓట్లు అభ్యర్థించారు. వార్డు అభివృద్ధి, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తానని, ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట స్థానికులు, మద్దతుదారులు పాల్గొన్నారు.

## 24వ వార్డులో స్వతంత్ర అభ్యర్థి ఉప్పుతోళ్ల సరోజినీ ప్రచారం



**మాచర్ల.అక్టోబర్ 27 రాజధాని వాయిస్ :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని 24వ వార్డు స్వతంత్ర అభ్యర్థి ఉప్పుతోళ్ల సరోజినీ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. వార్డు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుని, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డు అభివృద్ధికి నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ఈ ఎన్నికల్లో తనను ఆదరించి గెలిపించాలని ఆమె ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఆర్నాబ్ తుఫాన్ ముప్పు ప్రజలు ఇళ్లకే పరిమితం కావాలి

**మంత్రి డోలా వీరాంజనేయస్వామి**



**అమరావతి.అక్టోబర్ 27 రాజధాని వాయిస్ :** ఆర్నాబ్ తుఫాన్ ప్రభావంతో తీవ్ర ఈదురు గాలులు, భారీ వర్షాల ముప్పు పొంచి ఉన్నందున ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి కోరారు. ప్రజల రక్షణ కోసం ప్రభుత్వం ముందస్తు సహాయక చర్యలు చేపట్టిందని, అన్ని విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజలు అధికార యంత్రాంగం ఇచ్చే సూచనలు తప్పనిసరిగా పాటించాలని, ఏవైనా ఇబ్బందులు లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని, ప్రజలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

## దుర్గిలో ఘనంగా శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం

**ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జూలకంటి సతీమణి శోభారాణి**



**దుర్గి.అక్టోబర్ 27 రాజధాని వాయిస్ :**పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గ పరిధిలోని దుర్గి మండల కేంద్రంలో శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. చాత్తాద శ్రీవైష్ణవ పురోహితుల ఆధ్వర్యంలో చేపట్టిన 108 శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల సంకల్పంలో భాగంగా ఇక్కడ తొలి కల్యాణ వేడుకను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సతీమణి జూలకంటి శోభారాణి ముఖ్య అతిథిగా విచ్చేశారు. కల్యాణ వేదిక వద్ద స్వామి, అమ్మవార్లకు ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వేద పండితులు ఆమెకు ఆశీర్వచనాలు అందజేశారు. తొలిసారి మండల కేంద్రంలో స్వామివారి కల్యాణం జరగడంతో విశేష సంఖ్యలో తరలివచ్చి కనులారా తిలకించి పునీతులయ్యారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com